క్లుప్తంగా

శ్రీరంగనాథుడికి ధనుర్మాస పూజలు



పూజలందుకుంటున్న మూలవిరాట్ శ్రీరంగనాథుడు

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో కొలువైన శ్రీరంగనాథుడికి ధనుర్మాసం పురస్కరించుకొని శనివారం శ్రీదేవి, భూదేవిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవ, బిందెసేవ, అభిషేకం అనంతరం నైవేద్యం సమర్పించారు. దేవేరులతో పల్లకీలో కొలువైన ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలో ప్రదక్షిణలు చేపట్టారు.భక్తులకు ప్రసాదం అందజేశారు.

గోకులం షెడ్డు ప్రారంభం

పత్తికొండ(తుగ్గలి) : ఉపాధి హామీ నిధులతో మండలంలోని పెద్దహుల్తిలో నిర్మించిన గోకులం షెడ్డును శనివారం ఏపీఓ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మినీ గోకులాల ఏర్పాటులో ప్రభుత్వం 90 శాతం ఆర్థిక సాయం చేస్తుందని చెప్పారు. అలాగే జీ.ఎర్రగుడి, చెన్నంపల్లి, గిరిగెట్ల, సీజీతండాల్లో నిర్మించిన గోకులం షెడ్లను అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

మద్దికెర : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మినీ గోకులం షెడ్లు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఆంజనేయులు, ఏపీఓ నర్సిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో షెడ్డు ప్రారంభించారు. మండలంలో గోకులం షెడ్లు మంజూరైన వారు శరవేగంగా పూర్తి చేసుకోవాలని ఏపీఓ సూచించారు.

భక్తిశ్రద్ధలతో ద్వాదశి పూజలు



కూర్మనారాయణ స్వామి

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణస్వామి ఆలయంలో శనివారం ద్వాదశి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో కూర్మనారయణస్వామి, హనుమన్నస్వామి వారికి గంగ పూజ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కంబాలపాడు సర్పంచ్ మృతి



మారెమ్మ (ఫైల్)

కృష్ణగిరి: మండలంలోని కంబాలపాడు గ్రామ సర్పంచ్ మాదిగ మారెమ్మ (55) శనివారం మృతి చెందింది. కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కేఈ జయన్న ఆమె మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

సమస్యల సాధనకు పోరాటం



మాట్లాడుతున్న ఈశ్వర్

వెల్దుర్తి: ఆటో వర్కర్ల సమస్యల సాధనకు పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, ఈనెల 30,31వ తేదీల్లో విజయవాడలో జరిగే ఏపీ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభలకు హాజరై జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధు, ఈశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో స్థానిక యూనియన్ నేతలతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆటో వర్కర్ల జీవనోపాధికి ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఆదుకోవాలని ఇందుకు పోరాటాలే శరణ్యమన్నారు. యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గణేశ్, మండల అధ్యక్షుడు ఏసయ్య, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు మాధవస్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగమద్దయ్య పాల్గొన్నారు.

ఇరుముడితో శబరిమలైకు..

మద్దికెర : మండల కేంద్రంలో అయ్యప్ప మాలధారులు 41 రోజుల పాటు దీక్ష పాటించి శనివారం ఇరుముడులతో అయ్యప్ప స్వామి వారి దర్శనానికి శబరిమలకు తరలి వెళ్లారు. ముందుగా స్థానిక నగరేశ్వర స్వామి దేవాలయంలో అయ్యప్ప స్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడులు స్వీకరించారు. కార్యక్రమానికి విచ్చేసిన బంధువులు, మిత్రులు మాలధారులకు ప్రత్యేకంగా తెచ్చిన కానుకలు సమర్పించి పాదాభివందనం చేసి ఊరేగింపుగా సాగనంపారు. ఈసందర్భంగా ఆలయం భక్తులు, బంధువులతో కిటకిటలాడింది. పూజలకు విచ్చేసిన వారికి అన్నదానం చేశారు.



క్రీడా మైదానం లేని కేజీబీవీ పాఠశాల

- క్రీడా మైదానాలు లేక వెలుగులోకి రాని ప్రతిభ
- ఆసక్తి, సామర్థ్యం ఉన్నప్పటికీ సౌకర్యాల కొరతతో వెనుకబడిపోతున్న క్రీడాకారులు
- 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో గ్రామాల్లోని ఆటగాళ్లను వెలికితీసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

మైదానాలేవి మాస్టారూ!



నాతో పాటు.. బడిలో ఉండే వారందరికీ ఆడుకోవాలని ఉంది.. అయితే మా బడికి గ్రౌండ్ లేదంటున్న ఈ విద్యార్థిని పేరు హర్షవర్ధిని, చిప్పగిరి కస్తూర్బా విద్యాలయంలో ఏదో తరగతి చదువుతోంది. 'లీజర్ పీరియడ్ సమయంలో కనీసం చిన్న రింగ్‌బాల్ ఆటైనా ఆడుకుందామన్నా స్థలం లేదు. గ్రౌండ్ ఉంటే చుట్టూ మొక్కలు పెంచితే ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మాకు ఆ అవకాశం లేదు. దీంతో తరగతి గదులకే పరిమితమవుతున్నాం. చాలా ప్రాంతాల్లో మాతోటి పిల్లలు వివిధ క్రీడల్లో రాణిస్తున్నారని పేపర్లలో, టీవీల్లో చూస్తున్నప్పుడు మాకు అవకాశం రాలేదని బాధపడతాం. గ్రామంలోని పెద్దలు ఎవరైనా స్థలం ఇస్తే ఎంతో మంది ఆసక్తి ఉన్నవారు ఆటల్లో ప్రతిభ చాటడానికి అవకాశం కల్పించినట్లవుతుంది' అంటోంది చిన్నారి.

విద్యార్థి అసలు స్వభావం మైదానంలో బహిర్గమవుతుంది. తరగతి గదికే పరిమితమైతే శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు పోటీని ఎదుర్కొనే స్వభావం, ఓటమిని తట్టుకునే, గెలుపునకు పొంగిపోని స్వభావం వంటబట్టవు. ముఖ్యంగా ప్రస్తుత ప్రపంచంలో రాణించాలంటే నాయకత్వ లక్షణాలు ఎంతో అవసరం. ఇవన్నీ కేవలం క్రీడలు ఆడినప్పుడు మాత్రమే విద్యార్థికి అలవడతాయి. అయితే చాలా పాఠశాలలకు మైదానాలు లేకపోవడంతో పిల్లలు ఆటలకు దూరమవుతున్నారు. ఆసక్తి, ప్రతిభ ఉన్నప్పటికీ వెలుగులోకి వచ్చే అవకాశం లేకుండా పోతోంది.

చిప్పగిరి: మండలంలోని విద్యార్థులు ఆటలాడేందుకు అవకాశం లేకుండా పోతోంది. విద్యార్థి దశలో ఉన్నప్పుడే విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించాలని చెబుతున్నప్పటికీ పెంపొందించడం సంగతి అటుంచి ఆడాలని ఆశ ఉన్న వారు ఆటలు ఆడలేని పరిస్థితి. ఇందుకు కారణం.. పాఠశాలలకు మైదానాలు కొరవడటమే. ఆటల ద్వారా మానసిక, శారీరకంగా విద్యార్థులు ధృడంగా తయారవుతారు. అలాగే వారిలో నాయకత్వ లక్షణాలు, పోటీతత్వం, ఓటమిని తట్టుకునే సామర్థ్యం, విజయానికి పొంగిపోకుండా మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి ఉపయోగపడతాయి. మండలంలోని పలు స్కూళ్ల విద్యార్థులకు పలు క్రీడల్లో ప్రతిభ ఉన్నప్పటికీ మైదానాలు, వసతులు లేక వెలుగులోకి రాలేకపోతున్నారు. అరకొర వసతుల మధ్య శిక్షణ పొందిన కేజీబీవీ విద్యార్థినులు గతేడాది డిసెంబర్ 3న కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఫ్లోర్ కర్లింగ్ పోటీల్లో 14 మంది పాల్గొని ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. వీరు ఈనెల 28న జమ్ముకాశ్మీర్‌లో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. మరిన్ని వసతులు కల్పిస్తే గ్రామీణ విద్యార్థుల ప్రతిభ మరింత వెలుగులోకి వచ్చే అవకాశముంటుంది.

వెనుకబడిపోతున్న విద్యార్థులు..

మండలంలో మొత్తం 26 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో జెడ్పీ ఉన్నత పాఠశాలలు5, ప్రాథమికోన్నత 14, ప్రాథమిక 6, కేజీబీవీ-1 ఉండగా.. వీటిలో మొత్తం 3,167 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరిలో చాలా మందికి వివిధ క్రీడలలో ప్రతిభ, ఆసక్తి ఉన్నప్పటికీ సౌకర్యాలు అందుబాటులో లేక పోవడంతో వెనకబడి పోతున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోనున్న క్రీడాకారులను వెలికి తీసి వారి ప్రతిభను గుర్తించింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. మండల కేంద్రంతో పాటు నేమకల్లు,రామదుర్గం,డేగులహాలు,ఏరూరు తదితర గ్రామాల్లోని జెడ్పీహెచ్ హైస్కూళ్లలో క్రీడా మైదానాలు అందుబాటులో ఉన్నాయి. కేజీబీవీతో పాటు మిగిలిన 21 పాఠశాలలకు మైదానాలు లేవు. ప్రస్తుతం భూముల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో క్రీడా మైదానాలు దానం ఇవ్వడానికి దాతలు ఆసక్తి చూపడం లేదు. ఓ పాఠశాలకు క్రీడా మైదానంతోపాటు పాఠశాల నిర్వహణకు కనీసం 5 ఎకరాల వరకు స్థలం అవసరమవుతుంది. దాతలు స్థలం ఇవ్వడానికి ఆసక్తి చూపనందున గ్రామాల్లో సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములు గుర్తించి పాఠశాలలకు క్రీడా మైదానాలుగా మార్చి వసతులు కల్పించి అందుబాటులోకి తేవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాకారులు కోరుతున్నారు.



జాతీయ స్థాయి ఫ్లోర్ కర్లింగ్ క్రీడా పోటీలకు ఎంపికైన కేజీబీవీ విద్యార్థినులు (ఫైల్)

దాతలు ముందుకు రావాలి



మండలంలోని అనేక పాఠశాల్లో క్రీడా మైదానాలు లేక విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. ఆసక్తి, ప్రతిభ ఉన్న విద్యార్థులకు ఆడుకునేందుకు అనువైన, వసతులతో కూడిన స్థలం లేకపోవడంతో గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి రాలేకపోతున్నారనేది వాస్తవమే. ఒక పాఠశాల నిర్వహణకు కనీసం 5 ఎకరాల స్థలం అవసరం అవుతుంది. అనేక సంవత్సరాల క్రితం పెద్దలు దానం ఇచ్చిన స్థలాలే తప్ప ప్రస్తుతం ఎవరూ దానం ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. ఈ సమస్య తీవ్రంగా ఉంది. రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి పాఠశాల క్రీడా మైదానాలకు కేటాయిస్తే బాగుంటుంది.

– శ్రీనివాస రెడ్డి, ఎంఈఓ-2



క్రీడా మైదానం లేని బంటణహాలు ప్రాథమిక పాఠశాల



క్రీడా మైదానం లేని నగరదోణ ప్రాథమికోన్నత పాఠశాల

ఓబన్నను ఆదర్శంగా తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆలూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి కుడి భుజం వడ్డె ఓబన్నను నేటి తరం, వడ్డె కులానికి చెందిన యువతీ, యువకులు ఆదర్శంగా తీసుకోవాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని గోవర్ధన్ థియేటర్ అంబేద్కర్ సర్కిల్ వరకు గ్రామ నాయకుడు వి.నాగరాజ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదనంతరం స్థానిక వారపు సంత మార్కెట్‌లోని నల్లమల శ్రీసుంకులమ్మ దేవాలంలో ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు ముత్తప్ప, ఉరుకుందప్ప, ఈరన్న, నాగేష్,చెన్నకేశవులు, ఆంజనేయులు, చంద్ర పాల్గొన్నారు.

వెల్దుర్తి: తొలి స్వాతంత్ర్య సమర యోధుడు, పోరాట వీరుడు వడ్డె ఓబన్న జయంతి పురస్కరించుకుని శనివారం స్థానిక పాతబస్టాండులో వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఎల్ఈ జ్ఞానేశ్వర్ గౌడ్ వడ్డె ఓబన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు మహేశ్, మల్లికార్జున, మారెన్న, గోవిందు పాల్గొన్నారు.

హొళగుంద: మండల కేంద్రంలో శనివారం రేనాటి వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న జయంతి జరిగింది. స్థానిక ఈర్లకట్ట సమీపంలో ర్యాలీ నిర్వహించారు. వడ్డెర సంఘం నాయకులు ఎర్రిస్వామి, రామకృష్ణ, విశ్వనాథ్ తదితరులు మాట్లాడుతూ వడ్డెర్లు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని అందుకు విద్యావంతులు కావాలన్నారు.

● భయపెడుతున్న మేఘం



మేఘావృతం కావడంతో కందులను తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న రైతులు

మద్దికెర : పది రోజులుగా ఎండలు కాస్తుండడంతో కంది కోతలు పూర్తి చేసి పంట దిగుబడిని బయలు ప్రాంతాల్లో రైతులు ఆరబోసుకున్నారు. అయితే శనివారం మేఘాలు కమ్ముకోవడంతో భయంతో దిగుబడులను ఆఘమేఘాలపై ఇళ్లకు తరలించే పనులు ముమ్మరం చేశారు. కోతల అనంతరం పొలాల నుంచి నేరుగా సంచుల్లో వేస్తే పచ్చిగా ఉన్న గింజలు దెబ్బతింటాయని ఆరుబయట ఆరుబెట్టుకున్నామని, తుపాను ప్రభావం ఉందని తెలియడంతో ఇంటికి తరలిస్తున్నామని రైతులు తెలిపారు. ఇక చాలా చోట్ల శనగ పంట చేతికొచ్చింది. ఈ సమయంలో వర్షం కురిస్తే బుడ్డ పగిలి గింజలు నేలపాలవుతాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

వెల్దుర్తి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా బొమ్మన శివశంకర్ రెడ్డి స్మారకార్థం స్థానిక బాలుర హైస్కూల్ మైదానంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. హైస్కూల్ పీఎంసీ చైర్మన్ ముత్యాల చిన్న ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ 8 క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్ఐ అశోక్, టీడీపీ మండల అధ్యక్షుడు బలరాం గౌడ్ ప్రారంభించారు. ఎస్ఐ మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయని, శారీరక ధృడత్వంతో పాటు జీవితంలో మంచి నడవడిక, భవిష్యత్తుకు స్ఫూర్తిదాయకమన్నారు.



బిల్లేకల్లులో గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

మళ్లీ పిల్లలై పోయారు!

- ఆహ్లాదకర వాతావరణంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఆస్పరి: మండలంలోని బిల్లేకల్లు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పెద్దలంతా పిల్లల్లా వ్యవహరిస్తూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఆ దృశ్యాలను చూసిన స్థానికులు సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. 2003-04 నాటి 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం హెచ్ఎం పరిమళమణి ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన వారు 20 సంవత్సరాల తరువాత కలుసుకోవడంతో నాటి స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకొని సంతోషంగా గడిపారు. ముందుగా పరిచయ కార్యక్రమం నిర్వహించి ఒకరినొకరు తమ వివరాలను పంచుకున్నారు. అనంతరం నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు శేఖర్, రవికిరణ్, విజయభాస్కర్, సోమలింగం, సోమశేఖర్, రంగవల్లి,రాజ్యలక్ష్మి,నాగన్నను ఘనంగా సన్మానించారు. చివరగా..ఈ జ్ఞాపకాలను భద్రపరుచుకునేందుకు తమ గురువులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. పూర్వ విద్యార్థులు బడెసాబ్, లింగన్న, వీరేష్, బాషా, చక్రవర్తి, రవికుమార్, రమాదేవి, జయంతి, భారతి, సరస్వతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

ఆస్పరి: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆస్పరిలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఆస్పరి యూత్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రామకృష్ణ, మహేష్, అరవింద్ శనివారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి వరుసగా రూ. 20,116, రూ.10,116, రూ. 5,116 ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎంట్రీ ఫీజు రూ.500 ఈనెల 13వ తేదీ చెల్లించాలని, వివరాలకు సెల్ 9912951780,9010788451 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎక్సైజ్ అధికారుల విస్తృత దాడులు

తుగ్గలి : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పత్తికొండ సీఐ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో మండల పరిధిలోని బాటతండా, రోళ్లపాడు తండాల్లో శనివారం విస్తృత దాడులు నిర్వహించారు. తండాల సమీపాల్లో బట్టీలపై దాడులు చేసి నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచి 1,425 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులపై క్రూరత్వం పనికిరాదు

వెల్దుర్తి: న్యాయమైన డిమాండ్లు తీర్చాలని కోరుతూ రైతు నాయకుడు జగ్జీత్ సింగ్ దల్లేవాల్ 45 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తున్నా పట్టించుకోకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తోందని సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ శనివారం ఓ ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్త శుద్ధి లేదన్నది వాస్తవమని, ఇప్పటికే రైతు ఉద్యమంలో 750 మంది ప్రాణాలు కోల్పోవడమే ఇందుకు ఉదాహరణ అన్నారు. ఇప్పటికైనా బీజేపీ తమ పిడివాదం మానుకుని రైతుల డిమాండ్లు నెరవేర్చి, వారి జీవన పరిస్థితులు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.

రైతులకు న్యాయం చేయాలి



రామ్మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

తుగ్గలి : బంగారు నిక్షేపాల వెలికితీత కోసం భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు న్యాయం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బొల్లవానిపల్లి-పగిడిరాయి మధ్య ఏర్పాటవుతున్న జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ ప్లాంట్, రైతుల నుంచి సేకరించి భూములను ఆయన శనివారం పరిశీలించారు. గోల్డ్‌మైనింగ్ కంపెనీకి 1,500 ఎకరాల్లో మైనింగ్ చేపట్టేందుకు అనుమతులు పొందిఉన్నారు. అయితే ఇప్పటి వరకు కేవలం 350 ఎకరాలు మాత్రమే కొనుగోలు చేసి, మిగిలిన భూమిని లీజు రూపంలో తీసుకుంటున్నారు. ప్రారంభంలో ఇక్కడి ప్రజలకు, రైతులకు ఎన్నో హామీలు ఇచ్చిందని అయితే వాటిని ఇంత వరకు నెరవేర్చలేదన్నారు. భూముల కోల్పోయిన రైతు కుటుంబాల్లో అర్హులైన వారికి కంపెనీలో ఉద్యోగం ఇవ్వాలని, చుట్టుపక్కల గ్రామాల్లో కనీస వసతులు కల్పించడంతో పాటు కలుషిత నీటితో నష్టపోయిన పండ్ల తోటల రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కంపెనీ ప్రతినిధి రామ్మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. మోర్చా జిల్లా అధ్యక్షుడు ఈరన్న, నాయకులు దండి మల్లికార్జున, సీసీ రంగన్న, తిమ్మారెడ్డి, హరినాయుడు, రైతులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుల నియామకం



కె.మల్లికార్జున



బసవరాజ్



వడ్డే రామకృష్ణ



పి.రామిరెడ్డి



జె.మారయ్య



షఫి

మండలం	అధ్యక్షుడు
ఆలూరు	కె.మల్లికార్జున
ఆస్పరి	బసవరాజ్
దేవనకొండ	వడ్డె రామకృష్ణ
హాలహర్వి	పి.రామిరెడ్డి
చిప్పగిరి	జె.మారయ్య
హొళగుంద	షఫి

ఆలూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు పార్టీ మండల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి.

రవిరెడ్డి నియామకంపై హర్షం

వెల్దుర్తి: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా బొమ్మన రవీంద్రనాథ్ రెడ్డి (రవిరెడ్డి)ని మరోసారి నియమించడంపై ఆ పార్టీ శ్రేణుల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. బొమ్మన రవిరెడ్డి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ ప్రజాసేవలో ముందుంటూ వివాదరహితుడవడంతో పార్టీ అధిష్టానం మండల అధ్యక్షుడిగా ఐదవసారి ఎంపిక చేసింది. ఈయన ఎన్నికపై పార్టీ పట్టణ కన్వీనర్ వెంకట్ నాయుడు, ముస్లిం మైనారిటీ మండల కన్వీనర్ గట్టు ఆరిఫ్, ఎస్సీ సెల్ కన్వీనర్ రాజు శుభాకాంక్షలు తెలిపారు.

మద్దికెర : వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పార్టీ మండల కన్వీనర్‌గా ఎంపికైన మల్లికార్జున యాదవ్ తెలిపారు. శనివారం జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, నాయకులు తాలూరి వెంకటేశ్వర రెడ్డి, కృష్ణ మండల కన్వీనర్‌ను అభినందించారు.



సంబరాల్లో పాల్గొన్న ఐజీ ఆకె రవికృష్ణ



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

సంక్రాంతి సంబరాలు

దేవనకొండ: మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో శనివారం ప్రారంభమైన సంక్రాంతి సంబరాల్లో గ్రామాన్ని దత్తత తీసుకున్న ఐపీఎస్ అధికారి, ఐజీ ఆకె రవికృష్ణ దంపతులు పాల్గొన్నారు. ముందుగా గ్రామస్తులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ గ్రామంలో ఏటా జరిగే సంక్రాంతి సంబరాల్లో తాను కుటుంబ సమేతంగా పాల్గొంటున్నట్లు చెప్పారు. అందరూ కలిసి మెలిసి ఐక్యంగా జీవించాలని సూచించారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, ముగ్గుల పోటీలను ప్రారంభించారు.

ముగ్గుల పోటీలు

స్థానిక ఎఫ్ఆర్ హైస్కూల్‌లో శనివారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ముగ్గుల పోటీల్లో పాల్గొని రంగు రంగుల ముగ్గులను వేసి ప్రతిభ చాటారు. గెలుపొందిన విద్యార్థినులకు హెచ్ఎం ఉచ్చీరప్ప బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దగోనెహాళ్‌లో పారిశుద్ధ్య పనులు

హొళగుంద: మండలంలోని పెద్దగోనేహాళ్ గ్రామంలో సంక్రాంతి సందర్భంగా పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ కొత్తింటి వెంకటరెడ్డి శనివారం తెలిపారు. ముఖ్యంగా సీజన్ వ్యాధులు ప్రబలుతుండటంతో గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

ప్రమాదమని తెలిసీ..!



ధ్వంసమైన కల్వర్ట మీదుగా రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు

వెల్దుర్తి: వారు బాలలు..ప్రమాదాన్ని ఊహించలేని వయస్సు. బడికి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ధ్వంసమైన, ప్రమాదకరంగా మారిన కల్వర్టుపై రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వచ్చి వెళ్లే క్రమంలో అందులో పడితే ప్రమాదం జరుగుతందనే దానిపై వారికి ఏ మాత్రం అవగాహన లేదు. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలో కల్వర్టు శిథిలమైంది. ఈ దారి గుండా 5వ తరగతిలోపు చిన్నారులు రాకపోకలు సాగిస్తున్నారు. నెల క్రితం మెయిన్ బజారు నుంచి పోలీస్‌స్టేషన్ వరకు నిర్మించిన సీసీ రోడ్డు పనుల కోసం భారీ వాహనాలు ఈ చిన్న కల్వర్టుపై నుంచి ఇసుక, కంకర, ఇతరత్రా సామగ్రి సరఫరా చేయడంతో కల్వర్టు ధ్వంసమైంది. సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. ధ్వంసమైన కల్వర్టును పట్టించుకోకుండా వదిలేశారు. ఆ కల్వర్టుతో ప్రమాదాలు జరుగుతాయని వారికి తెలుసు. ఎందుకంటే వారికి ప్రమాదంపై అవగాహన ఉంది. అయినా పట్టించుకోరు.